పోస్టర్ ఆవిష్కరణ



ఉప్పల్: ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్య, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీజీఎస్‌బీసీఐ రామ్‌ప్రసాద్, ఎస్సై చెన్నరాయుడు తదితరులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు యువతపై చెడు ప్రభావాన్ని చూపుతున్నాయని, యువతీయువకులు వాటిని ధరిచేరనీయొద్దని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రవిప్రసాద్, ఏడీసీ సమన్వయకర్త డా.ఆర్ చంద్రసాగర్, ఎన్ఎస్ఎస్‌పీఓ జె.విశ్వనాథ్‌కుమార్, విజయ్ తదితరులున్నారు.

ప్రజలకు అండగా ఉన్నవారే నాయకులు



రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ బీజేపీ నేత వల్లభ్ జగన్ యాదవ్ మంగళవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను పరిష్కరిస్తే మంచి నాయకుడిగా తయారై ప్రజల ఆదరణ, అభిమానాలు పొందుతారన్నారు. అనంతరం తాను రాసిన 'ప్రజల కథ నా ఆత్మకథ' పుస్తకాన్ని అందజేశారు.

బోనాల ఉత్సవాలపై సమీక్ష



బోడుప్పల్ : చెంగిచర్లలో బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామపెద్దలు సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానికుల అభిప్రాయాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని చర్చించారు. ఈసారి వైభవంగా నిర్వహించేందుకు తీర్మానించారు. జూలై 27న వైభవంగా నిర్వహించేందుకు ప్రతిపాదించారు. మాజీ కార్పొరేటర్ చందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్, నేతలు రవి, శివశంకర్, రంగబ్రహ్మన్న, గోపాల్, వి క్రమ్, కుర్రి మహేష్, రాసాల కుమార్ పాల్గొన్నారు.

రైతు వేదిక నుంచి సీఎం సభను తిలకించిన కలెక్టర్



సాక్షి,సిటీబ్యూరో: రైతు నేస్తం కార్యక్రమాన్ని 8 రైతు వేదిక కేంద్రాలలో నిర్వహించినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శామీర్‌పేట్, సింగాయిపల్లి, కీసర, యాద్గార్‌పల్లి, ప్రతాపసింగారం ఘట్‌కేసర్, మేడ్చల్, మూడుచింతలపల్లి మండలాల్లో రైతువేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి రైతువేదిక నుంచి సెక్రటేరియట్ వద్ద ఏర్పాటు చేసిన రైతునేస్తం సీఎం రేవంత్‌రెడ్డి సభను ఆయన తిలకించారు. జిల్లా నుంచి 800 మంది రైతులు రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

3 నెలలుగా వేతనాలు లేవు !

'1962' సంచార పశువైద్యశాల ఉద్యోగుల ఆవేదన

మేడ్చల్: జిల్లాలోని సంచార పశువైద్యశాల '1962'లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం గత 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ.. సంస్థ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్‌లో సంచార పశువైద్యశాల వాహనం వద్ద నిరసన చేపట్టారు. వేతనాలు చెల్లించకున్నా.. తాము జిల్లాలోని మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వేతనాలపై ఆధారపడి జీవించే ఉద్యోగులకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో జీవితం ఆర్థికభారమైందన్నారు. ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవాలని ఉద్యోగులు కోరారు.

రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపు

మేడ్చల్: మేడ్చల్ హౌజింగ్ బోర్డు రోడ్డులో చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. రోడ్డుపై చిన్న డబ్బాలు, ఇతర వ్యాపారాలు ఏర్పాటు చేసి రోడ్డు కుచించుకుపోవడంతో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు జేసీబీల సాయంతో ఆక్రమణలను తొలగించారు. పట్టణ పరిధిలో రోడ్లపై అనధికారికంగా వ్యాపారాలు ఏర్పాటు చేస్తే వారి షెడ్లు, నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్‌కు నిధులు!

- రూ. 400 కోట్లు కేటాయించిన కేంద్రం
- ప్రారంభమైన భూసేకరణ ప్రక్రియ
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



ఘట్‌కేసర్ రైల్వే ప్లాట్‌ఫామ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట రాయగిరి వరకు ప్రతిపాదిత ఎంఎంటీఎస్ మూడో లైన్ నిర్మాణ పనులపై సందిగ్ధత తొలగనుంది. ఎంఎంటీఎస్ రైళ్ల కోసం రాయగిరి వరకు ఇప్పుడున్న 2 లైన్లకు అదనంగా మూడో లైన్ నిర్మించడానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. దీంతో మూడో లైన్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను రైల్వే, రెవెన్యూ అధికారులు ప్రారంభించారు.

☛ రెండో దశలో మౌలాలి-ఘట్‌కేసర్ మధ్య ఉన్న 12.2 కిలోమీటర్ల మేర ట్రాక్ పనులు పూర్తికావడంతో గతేడాది మార్చి 5 నుంచి ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తున్నాయి. ఎంఎంటీఎస్ నిర్మాణ సంస్థ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) ఆధ్వర్యంలో ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట రాయగిరి వరకు 34 కిలోమీటర్ల మేర కొత్తలైన్ పొడిగించి విద్యుదీకరించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

నెలరోజుల క్రితం కేటాయింపులు..

ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టడానికి నెల రోజుల క్రితం కేంద్రం రూ. 400 కోట్లను కేటాయించింది. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలు పొడిగించడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తుల కోసం ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్...

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఎంఎంటీఎస్ రైళ్లు అందుబాటులోకి తీసుకురావాలని రెండోదశలో రాయగిరి వరకు విస్తరించాలని ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా చెల్లించడం ఆలస్యం చేయడంతో ఇన్నాళ్లు పనులు సాగలేదు. ప్రస్తుతం ఉన్న రెండు లైన్లపై ఒత్తిడిని నివారించేందుకు మూడో లైన్ నిర్మిస్తున్నారు. తక్కువ డబ్బుతో ప్రయాణించే అవకాశం కోసం పేదలు ఎదురు చూస్తున్నారు.

పెరగనున్న రవాణా సౌకర్యం...

పెరిగిన జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యం కల్పించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్ నగరానికి సమీపంలో ఉండటం విద్య, ఉపాధికి ఇతర జిల్లాల నుంచి భారీగా వలసలు ఉంటాయి. దీనికితోడు వందలాది కాలనీలు, పదుల సంఖ్యలో ఇంజినీరింగ్ కళాశాలలు, ఇన్ఫోసిస్, రహేజాలాంటి అంతర్జాతీయ వ్యాపార సంస్థల రాకతో జనాభా విపరీతంగా పెరిగింది. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ విస్తరణతో ఎన్ఎఫ్‌సీనగర్, అంకుషాపూర్, అవుషాపూర్, కొండమడుగు గ్రామాల్లో స్టేషన్లు పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రయాణికుల సమయం, డబ్బు ఆదా కానున్నాయి. ఘట్‌కేసర్-యాదగిరిగుట్ట రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పూర్తి చేయడానికి కేంద్రం నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



గత ప్రభుత్వం యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలు పెంచాలని నిర్ణయించింది. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలి. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సేవలు పెంచడంతో పేదలకు మేలు జరుగుతుంది.

– పన్నాల కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత

రవాణా సదుపాయం పెరుగుతుంది



యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ విస్తరణతో భక్తులకు రవాణా సౌకర్యం మెరుగవుతుంది. దీంతో ఇతర రవాణా సౌకర్యాలపై ఒత్తిడి తగ్గుతుంది. భక్తులకు ఎంఎంటీఎస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

– కట్టు రాజశేఖర్‌రెడ్డి, బొక్కొనిగూడ

రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



యాదగిరిగుట్ట రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పనులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. పనులు పూర్తైతే ఎంఎంటీఎస్ స్టేషన్లు పెరిగే అవకాశం ఉంది. రవాణా పెరగడంతో ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ప్రయాణికుల సమయం, డబ్బు ఆదా అవుతుంది. ప్రభుత్వ వైఖరితోనే పనులు ఆలస్యమవుతున్నాయి.

– ప్రవీణ్‌రావు, అంకుషాపూర్

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

మల్లాపూర్: జూలై 9న అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గణేష్ పిలుపునిచ్చారు. మంగళవారం నాచారం, మల్లాపూర్‌లోని పారిశ్రామికవాడలో పరిశ్రమల యజమానులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం 29 కార్మికచట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను రూపొందించిందన్నారు. ఇవి కార్మిక వ్యతిరేకమైనవని విమర్శించారు. జూలై 9న జరిగే ఈ సమ్మెలో భాగస్వాములు కావాలని కార్మికులను కోరారు. సీఐటీయూ నాయకులు సునీల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక చట్టాలు అమలు చేయాలి'

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్-1లోని బయోసైన్స్ కంపెనీలో కార్మిక చట్టాలను అమలు చేయాలని చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బయోసైన్స్ యజమాన్యం కార్మిక చట్టాలను ఉల్లంఘించి కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. కంపెనీలో పనిచేస్తున్న 40 మంది కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, సెలవులు వంటి కనీస సౌకర్యాలను కల్పించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

పేదలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కార్పొరేటర్ సునీత తదితరులు

గౌతంనగర్: దశాబ్దకాలంగా జయగిరి లక్ష్మీనరసింహ్మ ఆలయ భూముల్లో నివాసం ఉంటున్న నివాసితులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అండగా నిలిచారు. గత కొంతకాలంగా ఆలయ భూముల్లో నివాసం ఉంటూ.. క్రమబద్ధీకరణ చేసుకోని ఇళ్లకు ఎండోమెంట్ అధికారులు నోటీసులు ఇచ్చి సీజ్ చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే న్యాయస్థానాన్ని ఆశ్రయించి కోర్టులో స్టే ఆర్డర్‌కు కృషి చేశారన్నారు. దీంతో ఆయా కాలనీవాసులు, కార్పొరేటర్ మేకల సునీత మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జేఏసీ వెంకన్న, బైరు అనిల్, సిద్ధి రాములు, కృష్ణగౌడ్, కాటం రాజు, బస్తీవాసులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల్లోని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కుషాయిగూడ: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ చౌరస్తా సమీపంలోని కుషాయిగూడ పారిశ్రామికవాడలో మంగళవారం స్కూల్ ఎదుట ఎమ్మెల్యే బైఠాయించి ధర్నాకు దిగారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలు, అక్రమ అనుమతులివ్వడాన్ని ప్రశ్నించారు. విషవాయువులు వెదజల్లే పరిశ్రమల పక్కన విద్యాసంస్థలకు అనుమతులివ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ అనుమతులు రద్దు చేసి సీజ్ చేసే వరకు ధర్నాను విరమించేది లేదని స్పష్టం చేశారు.

స్కూల్ సీజ్..

2 గంటల పాటుగా ఎమ్మెల్యే బైఠాయించడంతో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కాప్రా మండల విద్యాధికారి బాపురెడ్డి స్కూల్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను అనుమతులు ఎలా ఇచ్చారని నిలదీశారు. కుషాయిగూడ పారిశ్రామికవాడలో ఇప్పటికే 4 పాఠశాలలు నడుస్తున్నాయని, అదే ప్రాతిపదికన ఈ స్కూల్‌కు అనుమతులిచ్చినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్కూల్‌ను సీజ్ చేయడంతో ఆందోళన విరమించారు. కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సాయిజెనోఖర్, శివకుమార్‌గౌడ్, మహేష్‌గౌడ్, ప్రవీణ్, కనకరాజుగౌడ్, పద్మారెడ్డి పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం



సాక్షి,సిటీబ్యూరో: వనమహోత్సవం లక్ష్యానికి అనుగుణంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రత్యేక శ్రద్ధతో పూర్తిస్థాయిలో మొక్కలు నాటుతామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ నుంచి అటవీపర్యావరణశాఖ మంత్రి కొండాసురేఖ హాజరు కాగా.. మేడ్చల్ కలెక్టర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల లభ్యత, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు విషయాలను చర్చించారు. అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, జిల్లా అధికారులు ఉమాగౌరీ, చంద్రకళ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కమిషనర్ల ఓరియంటేషన్ ప్రోగ్రాం



ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న నూతన కమిషనర్లు

మేడిపల్లి: రాష్ట్రంలోని ఆయా మున్సిపాలిటీలకు పదోన్నతి ద్వారా త్వరలో కమిషనర్లుగా వివిధ మున్సిపాలిటీల్లో బాధ్యతలను చేపట్టనున్న 25 మందికి మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఒక్కరోజు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ విజయవంతంగా ముగిసినట్లు కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్‌లోని వివిధ అంశాలపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా నూతనంగా నియామకమైన కమిషనర్లకు వివరించడం జరిగిందన్నారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పర్వతాపూర్ డంపింగ్ యార్డును సందర్శించారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాల నిర్వహణ, తడి,పొడిచెత్తను పూర్తిస్థాయిలో వేరుచేసేవిధానం, తడివ్యర్థాల ద్వారా బ్రిక్స్ తయారీ, కంపోస్టు ఎరువుల తయారీ వంటి అంశాలపై వారికి వివరించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డీఈ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ సుమలత, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇన్విరాన్‌మెంట్ ఇంజినీర్ బాలమురళీకృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు తావు లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరలో పూర్తిచేస్తామని, నెహ్రూనగర్‌లో త్వరలోనే భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. జలమండలి మేనేజర్ రవీందర్‌గౌడ్, కిషన్‌తో పాటు సంక్షేమసంఘం ప్రతినిధులు జగదీష్, సురేష్, ముత్యం, ఉప్పలయ్యలు పాల్గొన్నారు.

యుద్ధం ఆపి శాంతి నెలకొల్పాలి

కుషాయిగూడ: ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాలు యుద్ధం ఆపేసి శాంతిని నెలకొల్పాలని సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కమలానగర్ పార్టీ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఇది సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమేనని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణజ్యోతి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శ్రీనివాసులు, వినోద, శ్రీనివాస్, యాదగిరిరావు, శ్రీమన్నారాయణ, గణేష్, శ్రీనివాసరావు, పీబీ.చారి, శరత్, సృజన, సఫియా, శివరామకృష్ణ, ప్రభాకర్, అశోక్, శశాంక్, కృష్ణామాచార్యులు, మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల గ్రేవ్‌యార్డుకు రూ.40 లక్షలు

ఉప్పల్: ఉప్పల్ నాయీ బ్రాహ్మణుల గ్రేవ్‌యార్డు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రేవ్‌యార్డు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన రూ. 40 లక్షల నిధుల మంజూరుపత్రాన్ని మంగళవారం ఉప్పల్ నాయీ బ్రాహ్మణ ప్రతినిధులకు అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఎలాంటి సమస్యలున్నా.. వాటన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు చంద్రమోహన్, మోహన్, భాస్కర్, మురళి, రాకేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు రూ.5.03 కోట్లు

సాక్షి,సిటీబ్యూరో: రైతు భరోసా పథకం కింద మంగళవారం వరకు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని 5198 మంది రైతుల ఖాతాల్లో రూ. 5.03 కోట్లు జమ అయినట్లు కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. విడతల వారీగా మిగిలిన రైతుల ఖాతాల్లోకి నిధులు పడతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అమెరికా దాడులపై సీపీఐ నిరసన

కీసర: ఇరాన్‌పై అమెరికా దాడులకు నిరసనగా మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపాలిటీ ఆర్‌జీకే కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ చట్టాలను అమెరికా బేఖాతరు చేస్తూ.. ఇరాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా దాడులు చేస్తుందన్నారు. ఇరు దేశాలు సంయమనంతో శాంతిచర్చలు జరపాలన్నారు. పరుశురాం, మోహన్, రాము, లక్ష్మణ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



మల్లాపూర్‌లో రోడ్లను ఊడుస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో ముందస్తు వర్షాకాలం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పరిసరాలను చీపురుతో ఊడ్చి చెత్తను స్వచ్ఛ బండిలో వేశారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధులు, విషజ్వరాల భారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. కాప్రా సర్కిల్ ఏఎంహెచ్ఓ మధుసూదన్‌రావు, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు యాదగిరి, ప్రభాకర్, ఎస్ఎఫ్ఏ లక్ష్మి, స్వప్న, లలిత, స్థానిక నేతలు చీగుళ్ల శ్రీనివాస్, వాసుగౌడ్, కృష్ణయాదవ్, రవిచారి, రాజు యాదవ్, రాపోలు శ్రీనివాస్, రఘు, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ మేకల సునీతారామయాదవ్ అన్నారు. వర్షాకాలం ముందస్తు చర్యల్లో భాగంగా మల్కాజిగిరి సర్కిల్ శానిటేషన్ ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జుననగర్ నుంచి ఈస్ట్ ఐఎస్‌నగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటించాలన్నారు. ఇంటి ముందు వచ్చే చెత్త రిక్షాల్లో వ్యర్థాలను వేయాలని రోడ్లపై వేయకూడదన్నారు. బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లిఖార్జుననగర్‌లో అవగాహన ర్యాలీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ మేడిపల్లి ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11కేవీ ధరణీనగర్ ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

◆ 11కేవీ పర్వతాపూర్ ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పర్వతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి ఒంటి గంట వరకు కరెంటు నిలిపివేయబడుతుంది.

◆ 11కేవీ బాలాజీ, అంజనాద్రి ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పర్వతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించాలని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రామంతాపూర్ : విద్యుత్ సబ్‌స్టేషన్ కామాక్షిపురం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేతలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, లక్ష్మీనారాయణ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. అల్వాల్ సబ్‌స్టేషన్ 11 కేవీ ధర్మకాంట ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, హకీంపేట సబ్‌స్టేషన్ 11కేవీ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా-2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: చిలుకానగర్ రాఘవేంద్రనగర్ కాలనీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్‌నర్సింగరావు తెలిపారు.

◆ హబ్సిగూడ ఫీడర్ పరిధిలో 11 కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ ప్రకటించారు.

గౌతంనగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. 11కేవీ రాఘవేంద్ర ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, 11కేవీ గీతాభవానీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

11కేవీ మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలో..

33/11 కేవీ మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఉప్పర్‌గూడ, ఎఫ్‌బీపీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ గాయత్రినగర్, మీర్‌పేట ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. 11కేవీ కృపానంద్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, 11కేవీ సంతోషిమానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి అండగా..

ఉప్పల్: రోడ్డు ప్రమాదం బారిన పడి ఆర్థికంగా చితికిపోయిన చిలుకానగర్‌కు చెందిన సూర్యచంద్రకు ఉప్పల్ మాల సంఘం బాసటగా నిలిచింది. ఇంటికే పరిమితమైన సూర్య చంద్రను ఆదుకోవాలని నిర్ణయించిన మాల సంఘం ప్రతినిధులు మాస శేఖర్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. రాములు, శ్రీనివాస్, రామచంద్రం, పురుషోత్తం, కృష్ణ మాల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.